క్లుప్తంగా

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

రాజమహేంద్రవరం సిటీ: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 15, 16వ తేదీల్లో ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ప్రకటించారు. నాందేడ్ – కాకినాడ టౌన్ (07487/88) మధ్య తిరిగే ఈ రైళ్లు రాజమహేంద్రవరం, సామర్లకోట స్టేషన్లలో ఆగుతాయన్నారు. వీటిని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

దూరవిద్యలో ప్రవేశాలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో 2023 – 24 సంవత్సరానికి దూరవిద్యలో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఆ స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ సీహెచ్ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. డిగ్రీ, పీజీ, ఎంబీఏ, పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్ కోర్సుల్లో మొదటి, రెండు, మూడో సంవత్సర ప్రవేశాలు పొందేందుకు గడువు ఈనెల 31తో ముగుస్తుందన్నారు. సంబంధిత విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని వాటిని స్టడీ సెంటర్‌లో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 73829 29614 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

154 కోడి కత్తుల స్వాధీనం



విలేకరులతో మాట్లాడుతున్న సీఐ గోవిందరాజు

రాజోలు: సర్కిల్ పరిధిలో 154 కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపారు. ఆయన బుధవారం రాజోలు సర్కిల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదేశాలపై కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ పర్యవేక్షణలో సఖినేటిపల్లి, మలికిపురం, రాజోలు ఎస్సైలు ఎస్.రాము, బి.సంపత్, జి.పృథ్వీలకు వచ్చిన సమాచారం ఆధారంగా ఈ చర్యలు చేపట్టామన్నారు. సంక్రాంతి పండగ పేరుతో అనధికారికంగా జూదాలు నిర్వహిస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయన్నారు. కోడి పందేలు నిర్వహించిన వారిని, పాత కేసుల్లో ముద్దాయిలను బైండోవర్ చేస్తామన్నారు. సంప్రదాయం పేరుతో అశ్లీల నృత్యాలను ప్రదర్శించినా, నిర్వహింపచేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మహిళా శక్తికి ప్రభుత్వం చేయూత

- ఆర్థికంగా అండదండలు
- వ్యాపారానికి ప్రోత్సాహం
- ఆకట్టుకుంటున్న మెప్మా అర్బన్ బజారు



పుష్కరఘాట్‌లో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ బజార్



వివిధ వస్తువులను విక్రయిస్తున్న మహిళ

రాజమహేంద్రవరం సిటీ: మహిళలు ఆర్థికంగా అభ్యున్నతి సాధించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. వారికి అన్ని రంగాల్లో ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. కుటుంబాలు, తద్వారా సమాజం బాగుపడాలంటే మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ఆయన లక్ష్యం. ఆ మేరకు ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తున్నారు. మహిళలు వ్యాపారాల్లో రాణించేందుకు చేయూత, వైఎస్సార్ ఆసరా వంటి పథకాలతో ఆర్థిక భరోసా కల్పించారు. సొంతంగా వస్తువులు తయారు చేసి, మార్కెట్‌లో అమ్మకం సాగించేలా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ప్రతి నెలా రెండో గురు, శుక్రవారాల్లో రాజమహేంద్రవరంలోని స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన వస్తువులను స్థానిక పుష్కర ఘాట్‌లో మెప్మా బజార్ పేరుతో విక్రయించేందుకు ఏర్పాట్లు చేశారు.

ప్రజల ఆదరణ

2023 ఏప్రిల్‌లో మొదలైన మెప్మా అర్బన్ బజార్ ప్రజల ఆదరణ పొందింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని డ్వాక్రా మహిళలు స్వయం ఉపాధి దిశగా దూసుకుపోతున్నారు. పురుషులతో సమానంగా రాణిస్తూ కుటుంబానికి కొండంత అండగా నిలుస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు అంతంత మాత్రంగా అవకాశాలు కల్పించడంతో స్వయం ఉపాధి దిశగా ముందడుగు వేయలేకపోయారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ మహిళలకు ప్రాధాన్యం ఇస్తూ స్వయం శక్తితో ఎదిగేందుకు బాటలు వేశారు. దీంతో డ్వాక్రా పొదుపు సంఘాలు చిరు వ్యాపారాలు ప్రారంభించి తోటి వారికీ ఉపాధి కల్పించే లక్ష్యంతో ముందుకు వెళుతున్నాయి. అక్కడ మహిళలు తాము తయారు చేసిన ఉత్పత్తులను అందుబాటు ధరలకే నగర ప్రజలకు విక్రయిస్తున్నారు.

వివిధ ఉత్పత్తుల విక్రయం

రాజమహేంద్రవరం నగరంలోని 6,345 స్వయం సహాయక సంఘాల్లో 63,514 మంది సభ్యులు ఉన్నారు. రుణాలు పొందిన ఈ మహిళలందరూ ఇంటి వద్దే వివిధ రకాల ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. వివిధ రకాల దుస్తులు, స్త్రీల అలంకరణ వస్తువులు, జ్యూట్ బ్యాగులు, కొయ్య బొమ్మలు, వైర్ బ్యాగులు, హోమ్ మేడ్ ఫుడ్ ప్రోడక్టులు, వెజ్, నాన్ వెజ్ పచ్చళ్లు తదితర వాటిని తయారు చేసి విక్రయిస్తున్నారు. వీటిని మార్కెట్లో ప్రోత్సహించేందుకు అవకాశం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఈ బజార్‌లో వ్యాపారాలు సాగించేందుకు 32 రకాల షాపులు ఏర్పాటు చేసేందుకు మహిళలు ఉన్నారు.

జగనన్న ప్రోత్సాహం



జగనన్న అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిది. ఇంటి వద్ద తయారు చేసిన వస్తువులను విక్రయించేందుకు బజారు ఏర్పాటు చేయడం ద్వారా ఆర్థికంగా నిలబడేందుకు అవకాశం ఏర్పడింది. బజారు ఏర్పాటు చేసిన దగ్గర నుంచీ ప్రజలు ఆదరిస్తున్నారు. నాణ్యతతో కూడిన నైటీలు, పంజాబీ డ్రెస్‌లు, మహిళలకు కావాల్సిన అన్ని రకాల వస్త్రాలు అందించేందుకు కృషి చేస్తున్నాం.

– అరుణ

కష్టానికి ప్రతిఫలం



మేము పడుతున్న కష్టానికి ప్రతిఫలం దక్కుతోంది. కుట్టు పని ద్వారా తయారు చేసిన వస్తువులకు బజారులో మంచి గిరాకీ లభిస్తోంది. తక్కువ ధరకు మహిళలకు జాకెట్లు, జిగ్‌జాగ్ మొదలగు వాటిని సిద్ధం చేసి అందజేస్తున్నాం. ప్రభుత్వం సహకారం మరువలేనిది. తయారు చేసిన వస్తువులకు ప్రజల ఆదరణ లభిస్తోంది.

– సంధ్యారాణి

ఇద్దరు గంజాయి స్మగ్లర్ల అరెస్టు



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ లక్ష్మణరావు

జగ్గంపేట: కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన గంజాయి రవాణా కేసులో నిందితులైన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు. జగ్గంపేట సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ ఎస్.లక్ష్మణరావు ఈ వివరాలు వెల్లడించారు. 2021 డిసెంబర్‌లో విశాఖపట్నం ఏజెన్సీలోని ధారకొండ గ్రామం నుంచి మహారాష్ట్రకు 750 కేజీల గంజాయిని 152 ప్యాకెట్లలో నింపి, కారులో తరలిస్తున్నారు. ఆ వాహనాన్ని కత్తిపూడి వద్ద పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో పలు మార్గాల్లో తిప్పి, చివరకు కిర్లంపూడి మండలం తామరాడ వద్ద ఏటిగట్టున గంజాయి ప్యాకెట్లుతో వదిలేశారు. పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో స్కూటీపై వెళుతున్న ఒక వ్యక్తిని కారుతో ఢీకొనగా, అతడు మృతి చెందాడు. అప్పటి నుంచి నిందితులు తప్పించుకుని తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం కృష్ణవరం టోల్‌గేట్ వద్ద నిర్వహించిన తనిఖీలలో ఈ కేసులో ప్రధాన నిందితులైన హనుమాన్ మోహిత్ (27), సమీర్ సుధాకర్ గవాంది (29)ను గుర్తించి కిర్లంపూడి పోలీసులు అరెస్టు చేశారు. ఇదే ముఠాకు చెందిన అతుల్ ఓంకార్, సంజయ్ పాండురంగ, ఉమేష్ టాకిరే కోసం గాలిస్తున్నారు. ప్రధాన నిందితులపై మోతుగూడెం పీఎస్ పరిధిలోనూ, ఒడిశాలోని మల్కాన్‌గిరి జిల్లాలోనూ, ఛత్తీస్‌గఢ్‌లోని కుంట పీఎస్ పరిధిలోనూ హత్య, హత్యాయత్నం కేసులు ఉన్నాయి.

యానాం సబ్‌జైలు ఘటనలో ఏడేళ్ల జైలు



యానాంలోని సబ్ జైలు

యానాం: యానాం సబ్‌జైలులో చొరబడి పుదుచ్చేరికి చెందిన ఒక విచారణ ఖైదీని హతమార్చేందుకు ప్రయత్నించి, దొరికిపోయిన 13 మందికి ఏడేళ్ల శిక్ష విధిస్తూ బుధవారం పుదుచ్చేరి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు తీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళితే.. యానాం సబ్‌జైలులోకి 2013 ఆగస్టు 2013వ తేదీ అర్ధరాత్రి పుదుచ్చేరి నుంచి వచ్చిన కొందరు రౌడీషీటర్లు గోడ దూకి చొరబడ్డారు. అక్కడే కాపలా ఉన్న సెంట్రీని బంధించి నోటికి ప్లాస్టర్ వేశారు. అదే సమయంలో అటుగా వెళుతున్న మరో సెంట్రీ ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి పారిపోతున్న 13 మంది నిందితులను తాళ్లరేవు మండల పరిధిలోని ఉప్పంగల, లచ్చిపాలెం తదితర ప్రాంతాల్లో అరెస్టు చేశారు. దీనిపై అప్పటి ఎస్సై కె. షణ్ముగం కేసు నమోదుచేసి చార్జిషీటు దాఖలు చేశారు. అప్పటి నుంచీ దాదాపు 11 ఏళ్ల పాటు ఈ కేసు విచారణ సాగింది. దీనికి సంబంధించి 18 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరు తెలుగువాడు, మిగిలిన వారందరూ పుదుచ్చేరికి చెందినవారు. ఈ మేరకు బుధవారం పుదుచ్చేరి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి కె.మోహన్ నిందితులకు శిక్ష ఖరారు చేస్తూ తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.రాజు వాదనలు వినిపించారు. 13 మంది నిందితుల్లో విజయ కుమార్, సిలమ్‌బర్సన్ విచారణ సమయంలోనే మృతి చెందారు. అలాగే విళ్ల శంకర కరుణ, పళ్ల సురేష్ నిర్దోషులుగా విడుదల చేశారు. ఒక్కడు పరారీలో ఉన్నాడు.

రైల్వే బ్రిడ్జిల నిర్మాణ పనుల పరిశీలన



రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న రైల్వే సాధన సమితి సభ్యులు

మామిడికుదురు: వైనతేయ, వశిష్ఠ నదులపై నిర్మాణంలో ఉన్న రైల్వే బ్రిడ్జిలను కోనసీమ రైల్వే సాధన సమితి బుధవారం పరిశీలించింది. వైనతేయ వారధిపై నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనులను బృందం పరిశీలించి రైల్వే ప్రాజెక్టు పురోగతిపై సమీక్షించింది. ఈ బ్రిడ్జికి సంబంధించి 19 పిల్లర్లకు గాను 12 పిల్లర్ల నిర్మాణం పూర్తి కాగా, ఏడు పిల్లర్లు నిర్మాణంలో ఉన్నట్టు అధికారులు తెలిపారని సాధన సమితి కన్వీనర్, డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తెలిపారు. రెండు అబెట్‌మెంట్ పిల్లర్లకు సంబంధించిన స్థలం రాష్ట్ర ప్రభుత్వం అప్పగించాల్సి ఉందన్నారు. చించినాడ వద్ద వశిష్ఠ రైల్వే బ్రిడ్జికి మొత్తం 19 పిల్లర్లు, రెండు అబెట్‌మెంట్ పిల్లర్ల నిర్మాణం పూర్తి కావచ్చాయన్నారు. రెండు బ్రిడ్జిల వద్ద 160 మంది పనిచేస్తున్నారన్నారు. కోటిపల్లి వద్ద గౌతమి బ్రిడ్జికి సంబంధించి 45 పిల్లర్లపై ట్రాక్ నిర్మాణానికి ప్రసాద్ కన్‌స్ట్రక్షన్‌కు కాంట్రాక్టు మంజూరు అయ్యిందని, త్వరలోనే ట్రాక్ నిర్మాణం మొదలవుతుందన్నారు. ముక్తేశ్వరం – అమలాపురం ట్రాక్ నిర్మాణానికి త్వరలోనే టెండర్లు పిలిచేందుకు సాంకేతిక అంశాలను రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారన్నారు. అమలాపురం – గుడిమెళ్లంక స్థల సేకరణ కోసం సర్వే పూర్తయ్యిందని, దీనిపై రైల్వే, రాష్ట్ర అధికారులు జాయింట్ సర్వే జరిపి అలైన్‌మెంట్‌ను నిర్ధారించాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు సప్పా నాగేశ్వరరావు, బీఎస్ మూర్తి, ఉప్పుగంటి భాస్కరరావు, పోలిశెట్టి శివాజీ, ఎరగర్త వెంకటేశ్వరరావు, దొమ్మేటి సత్యనారాయణ, జీవీ కృష్ణారావు పాల్గొన్నారు.

అర్హులందరికీ గృహ యోగం



కోరంగిలో లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం అర్హులందరికీ ఉచితంగా గృహ యోగం కల్పిస్తుందని టీటీడీ పాలకమండలి సభ్యుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. బుధవారం కోరంగి పంచాయతీ సీతారామపురంలో గతంలో ఇచ్చిన 670 మంది లబ్ధిదారులకు స్థలాలను చూపించడంతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న మరో 223 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే పొన్నాడ పట్టాలు పంపిణీ చేశారు. సంక్షేమ పథకాల ద్వారా ఇంటింటికీ లబ్ధి చేకూరుస్తున్న ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, సర్పంచ్ పెయ్యల మంగేష్, వైస్ ఎంపీపీలు ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కొపనాతి నాగరాజు, జెడ్పీ మాజీ చైర్మన్ దున్నా జనార్దనరావు, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాదా గోవిందకుమార్, రాయుడు గంగాధర్ పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకుల ప్రారంభం

మండల పరిధిలోని కోరంగి, తాళ్లరేవు పంచాయతీలలో రూ.3.25 కోట్ల ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన ఆరు తాగునీటి ట్యాంకులను బుధవారం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ప్రారంభించారు. రూ.30 లక్షలతో శ్రీరంగనాయకపురంలో, రూ.36 లక్షలతో పాతకోరంగిలో, రూ.68 లక్షలతో బొడ్డువానిలంకలో, రూ.55 లక్షలతో పీబీవీ పాలెంలో, రూ.70 లక్షలతో సీతారామపురంలో, రూ.63 లక్షలతో ప్రతాప్ నగర్‌లో నిర్మించిన తాగునీటి ట్యాంకులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఇంటింటికీ కుళాయిని ఏర్పాటుచేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, సర్పంచ్‌లు పెయ్యల మంగేష్, రెడ్డి సుహాసినీదేవి పాల్గొన్నారు.

ఈవోపీఆర్డీ అసోసియేషన్ అధ్యక్షుడిగా మల్లికార్జునరావు



అమలాపురం రూరల్: ఈవోపీఆర్‌అండ్ ఆర్డీ అసోసియేషన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడిగా అమలాపురానికి చెందిన గుబ్బల మల్లికార్జునరావు ఎన్నికయ్యారు. అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో నూతన కమిటీ ఎన్నికలు బుధవారం జరిగాయి. ఉపాధ్యక్షురాలిగా బి.మంగాదేవి, (మలికిపురం), కార్యదర్శిగా యు. నాగేంద్ర,(కె.గంగవరం), కోశాధికారిగా డి.శ్రీనివాసు (ఆత్రేయపురం), జాయింట్ సెక్రటరీగా ఎస్ఎస్ రాజు (రామచంద్రపురం), ఆర్గనైజింగ్ సెక్రటరీగా జి.భీమారావు (రాజోలు), స్టేట్ కౌన్సిలర్‌గా కె.కామేశ్వరరావు (కాట్రేనికోన), సభ్యులుగా ఎ.శ్రీనివాసరావు (మామిడికుదురు), ఎం.శ్రీనివాసరావు (రాయవరం), ఎ.శ్రీనివాసరావు (మామిడికుదురు), కె.సూర్యనారాయణ (సఖినేటిపల్లి) ఎంపికయ్యారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు



నుజ్జునుజ్జయిన కారు

యానాం: యువకులు మద్యం మత్తులో కారు నడిపి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఘటన యానాం బీచ్ రోడ్డులో చోటుచేసుకుంది. ఎస్ఐ పువ్వల వీరభద్రరావు తెలిపిన వివరాల ప్రకారం మచిలీపట్టణానికి చెందిన యువకులు చందనకుమార్, యశ్వంత్ గత కొద్దిరోజులుగా అరటికాయలంక వద్ద ఉన్న రిసార్ట్‌లో ఉంటున్నారు. బుధవారం యానాం సందర్శించేందుకు కారులో వచ్చిన వారిద్దరూ మద్యం తాగి స్థానిక గౌతమీ రివర్ బీచ్ రహదారిలో మితిమీరిన వేగంతో కారును నడపడంతో అది కాస్తా అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో పాటు ముందు రెండు చక్రాలు ఊడిపోయాయి. అయితే అదృష్టవశాత్తు కారులో ఉన్న ఇద్దరు యువకులు ప్రాణాలతో బయటపడ్డారు. మద్యం తాగి వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగిందని, కారును సీజ్ చేసి యువకుల్దిదరిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

యమధర్మరాజు తైల వర్ణ చిత్రం బహూకరణ

అమలాపురం టౌన్: స్థానిక శ్రీగౌతమ మహర్షి అక్షయ పాత్ర నిర్వహిస్తున్న జ్యోతిర్లింగార్చన పూజల నిమిత్తం రూ.40 వేల విలువైన యమధర్మరాజు తైల వర్ణ చిత్రాన్ని సలాది సాయిరామ్ బుధవారం బహూకరించారు. అలాగే విద్యుత్ నగర్‌లోని శ్రీఆదిశేష నిలయంలో అక్షయ పాత్ర ప్రతినిధులు లింగోలు విస్సు, శిరీష దంపతులు గాయత్రీ సహిత శ్రీమహాలక్ష్మి హోమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో అక్షయ పాత్ర ప్రతినిధులు చాగంటి ప్రసాద్, గొవ్వాల అచ్యుతరామయ్య, పోతురాజు నాగ కనకదుర్గ పాల్గొన్నారు.

యోగా ద్వారా సృజనాత్మకత

ముమ్మిడివరం: యోగా సాధన ద్వారా విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గి వారిలో దాగి ఉన్న సృజనాత్మకత శక్తులు బహిర్గతమవుతాయని సహజ యోగా ఏపీ సెమినార్ కోఆర్డినేటర్ యాళ్ల రవి కుమార్, ఏపీ కమిటీ సభ్యులు ఏఎస్‌వీ పట్టాభిరామ్‌లు అన్నారు. బుధవారం ముమ్మిడివరం శ్రీకృష్ణ దేవరాయ మహిళా జూనియర్ కళాశాల, రావు బహుదూర్ రఘుపతి వెంకటరత్నం నాయుడు మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు మెడిటేషన్‌లో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జి.బ్రహ్మానందం, ప్రిన్సిపాల్ గంధం శ్రీరామూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యతో మానవతా విలువలు నేర్వాలి

అమలాపురం టౌన్: యువజన సర్వీస్‌ల శాఖ కాకినాడ సెట్రాజ్ ఆధ్వర్యంలో స్థానిక ది అమలాపురం కళాశాలలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజనోత్సవాలు–2024 బుధవారం జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సెట్రాజ్ మేనేజర్ కేఎస్‌వీ కాశీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు మానవతా విలువలను కూడా నేర్వాలన్నారు. కార్యక్రమంలో సెట్రాజ్ సూపరింటెండెంట్ సీవీ సూర్యనారాయణ, సెట్రాజ్ ఫీల్డ్ అసిస్టెంట్ కేఎస్‌వీ గౌతమ్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎం.రాంబాబు, డైరెక్టర్లు జీవీఎస్ నాయుడు, ఎం.కిరణ్‌కుమార్, ఎం.సతీష్, ప్రిన్సిపాల్ సికిలే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు దుస్తుల సొమ్ము జమ

యానాం: సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఎస్సీ, ఎస్టీలు దుస్తులు కొనుగోలు చేసుకునేందుకు సొమ్మును ఆది ద్రావిడ శాఖ మంజూరు చేసిందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ బుధవారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీల్లో 2,057 ఎరుపు, పసుపు రంగు రేషన్ కార్డుదారులకు రూ.1,000 చొప్పున 5,542 మందికి మొత్తంగా రూ.55.42 లక్షలను వారి బ్యాంకు అకౌంట్లలో జమ చేసిందన్నారు. ఈ మేరకు ఎల్జీ ఆదేశాల మేరకు ఆది ద్రావిడ శాఖ కార్యదర్శి మురుగేషన్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

ఘనంగా జాతీయ యువజన దినోత్సవం

ముమ్మిడివరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీపుల్స్ ఆర్గనైజేషన్, చైతన్య వలంటీర్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం జాతీయ యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. యువజనోత్సవాల్లో పురుషులకు వాలీబాల్, రన్నింగ్, లాంగ్ జంప్, మహిళలకు కబడ్డీ, రంగోలి, పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రముఖ న్యాయవాది టి.నాగరాజారావు, పీపుల్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు కర్నీడి వెంకటేశ్వరరావులు ప్రారంభించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ శ్రీనివాసరావు, ఎం.శివకుమార్, కేబీ కిషోర్, సీహెచ్ వెంకట సుధీర్, డి.నాగు, కె.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

అమలాపురం రూరల్: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అధికారులకు రెండు రోజుల శిక్షణా తరగతులు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ముగిశాయి. జిల్లా పంచాయతీ అధికారి వంగా కృష్ణకుమారి, డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్‌లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి పి.బొజ్జిరాజు, రామచంద్రాపురం ఈవోపీఆర్డీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్మృతి వనం సందర్శన

ఐ.పోలవరం: విజయవాడలో సామాజిక న్యాయ మహా శిల్పం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనాన్ని మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షుడు ఢిల్లీ నారాయణలు బుధవారం సందర్శించారు.

మత్స్యకారుల నిరసన ర్యాలీ

యానాం: తమకు రావాల్సిన రూ.23 కోట్ల ఓఎన్‌జీసీ నష్ట పరిహారం సొమ్మును ప్రభుత్వం వెంటనే చెల్లించాలంటూ మత్స్యకారులు రోడెక్కి నిరసన ర్యాలీ చేశారు. బుధవారం గిరియాంపేట, సావిత్రినగర్, దరియాలతిప్ప, కురసాంపేట, మెట్టకూరు, ఓల్డ్ రాజీవ్‌నగర్, ఫ్రాన్స్ తిప్ప, మెట్టకూరు తదితర గ్రామాల నుంచి అధికసంఖ్యలో మత్స్యకారులు పాతబస్టాండ్, చిన్నాసెంటర్ మీదుగా స్థానిక ఆర్ఏఓ ఆఫీసు వరకూ ర్యాలీగా వచ్చారు. ఓఎన్‌జీసీ చెల్లించిన సొమ్మును తమ ఖాతాల్లో వేయకుండా ప్రభుత్వం వద్ద ఉంచేసుకోవడం అన్యాయమంటూ నినదించారు. సీఐ షణ్ముగం నేతృత్వంలో పోలీసులు వారిని ఆపి అనుమతి లేకుండా ర్యాలీ చేయకూడదని వారించారు. లబ్ధిదారుల స్క్రూటినీ పూర్తి కాగానే ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని ఫిషరీస్ ఏడీ దడాల గొంతియ్య ఆందోళనకారులకు వివరించారు. ర్యాలీలో మత్స్యకార నాయకుడు అరదాడి పోషియ్య, లంకే జాన్, ఆదినారాయణ, మోదే హరిశ్చంద్ర, గౌరీశంకర్, కృష్ణ, మేడా భైరవస్వామి, అరదాడి మణికంత, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదరికాన్ని నిర్మూలించాలి

అమలాపురం టౌన్: సమాజంలో పేదరికాన్ని నిర్మూలించి పేదలకు పరిపూర్ణమైన అభివృద్ధి ఫలాలు అందించే దిశగా ఐక్యతా విజయ పథం పేరుతో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ జీఎస్ఆర్‌కేఆర్ అన్నారు. ఆయన నిర్వహిస్తున్న ఐక్యతా విజయ పథం పాదయాత్ర బుధవారం సాయంత్రానికి అమలాపురం చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఆయన ప్రసంగించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఉంద్రు బాబ్జి, కవి సవేర, ఎస్ఎస్ఆర్ భూపతి, బొంతు రమణ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులు ఆటల్లో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న జెడ్పీటీసీ సభ్యుడు సంపదరావు

ఉప్పలగుప్తం: విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు అన్నారు. మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించి ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా ఆటల్లో యువతంతా ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, ఈవోపీఆర్డీ కేఎస్ గౌరీకుమారి, పీడీ గొలకోటి ఫణి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో రోగికి పింఛన్ అందజేత



కాకినాడ ఆస్పత్రిలో అనంతలక్ష్మికి పెన్షన్ అందిస్తున్న వలంటీర్ నాగదుర్గ

అల్లవరం: కాకినాడ సెవెన్త్ స్టార్ ఆస్పత్రిలో వెన్నుముక ఆపరేషన్ చేయించుకుని చికిత్స పొందుతున్న అల్లవరం మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన బళ్ల అనంతలక్ష్మికి వలంటీర్ వాకపల్లి నాగదుర్గ బుధవారం ఆస్పత్రిలో పెన్షన్ అందించారు. తన సొంత ఖర్చులతో కాకినాడ వెళ్లి పెన్షన్ అందజేసిన వలంటీర్‌ను ఎంపీడీఓ కృష్ణమోహన్, సర్పంచ్ వడ్డి సుభాషిణి, ఎంపీటీసీ సభ్యురాలు పులుసుగంటి రాజేశ్వరి అభినందించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



గొల్లవిల్లి సచివాలయం వద్ద సంతకం చేస్తున్న మంత్రి విశ్వరూప్

ఉప్పలగుప్తం: అంబేడ్కర్ సూచించిన అడుగుజాడల్లో ప్రతీ ఒక్కరూ నడిచి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని రాష్ట్ర రవాణా మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని గొల్లవిల్లిలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ ఆధ్వర్యంలో అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం ఆవిష్కరణ సందర్భంగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో మంత్రి విశ్వరూప్ బుధవారం పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి అంబేడ్కర్‌పై తన అభిమానాన్ని చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

పన్నుల విధింపు పారదర్శకంగా జరగాలి

- ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు
- కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్‌పై చర్చ



కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్‌పై చర్చిస్తున్న సభ్యులు

అమలాపురం టౌన్: మున్సిపాలిటీలో పన్నుల విధింపు పారదర్శకంగా జరగాలని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ హాలులో బుధవారం ఉదయం జరిగిన బడ్జెట్ సమావేశంలో అమలాపురం మున్సిపాలిటీ 2022–23 సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలను, 2023–24 సంవత్సరానికి బడ్జెట్ అంచనాలను సభ్యులు ఆమోదించారు. సమావేశానికి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు హాజరై బడ్జెట్‌పై కూలంకుషంగా చర్చించారు. అనంతరం పన్నుల విధింపు, వసూళ్ల విషయంలో జరుగుతున్న నిర్లక్ష్యంపై ఎమ్మెల్సీ సూర్యనారాయణరావుతో పాటు పాలక పక్ష కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. పట్టణంలో నాలుగు అంతస్తుల షాపింగ్ మాల్‌లో ఓ అంతస్తు రెసిడెన్షియల్‌గా పేర్కొంటూ పన్ను భారం తగ్గించేలా పన్ను విధించారంటూ చర్చకు వచ్చింది. పట్టణంలో సినిమా థియేటర్లు రీమోడల్ అయి ఏసీలు, మల్టీ థియేటర్లుగా అభివృద్ధి చెందినా గతంలో వేసిన పన్నులనే వసూళ్లు చేయడంపై కౌన్సిలర్లు నాగేంద్ర, పెదబాబు మున్సిపల్ ఆర్వో శివాజీని ప్రశ్నించారు. మున్సిపాలిటీలో పన్నుల విధింపు, వసూళ్లకు ఓ స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేయాలని, కౌన్సిలర్లతో స్టాండింగ్ కమిటీ పర్యవేక్షణ పెట్టాలని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు సూచించారు. కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వచ్చే మార్చి లోపు అన్ని సక్రమంగా సాగేలా చేస్తానని హామీ ఇవ్వడంతో ఆ అంశానికి అక్కడితో తెరపడింది.

ఇదీ బడ్జెట్ స్వరూపం

మున్సిపాలిటీ 2022–23 సంవత్సరానికి వసూళ్ల పరంగా 2023–24 సంవత్సరానికి మొత్తం జమలను రూ.46,88,37,273గా చూపిస్తూ సవరించిన అంచనా బడ్జెట్‌ను రూ.56,75,27,482గా సమర్పించింది. అదే చెల్లింపుల పరంగా మొత్తం ఖర్చులను 2022–23 సంవత్సరానికి రూ.33,25,63,791 చూపిస్తూ 2023–24 సంవత్సరానికి సవరించిన బడ్జెట్‌ను రూ.51,69,37,000 గా పేర్కొంది. మున్సిపల్ వైస్ చైర్మన్ తిక్కిరెడ్డి వెంకటేష్, కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని, చిట్టూరి పెదబాబు, గొవ్వాల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓహెచ్‌ఆర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ



ఓహెచ్‌ఆర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: మండలంలోని గోడి గ్రామంలోని జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించనున్న 40 వేల లీటర్ల సామర్థ్యమున్న ఓహెచ్‌ఆర్ ట్యాంక్ పనులకు ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ బుధవారం భూమి పూజ నిర్వహించారు. ట్యాంక్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని వితరణ చేసిన కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన దాత నామన సిద్ధాంతిని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రూ.45 లక్షల నిధులతో ట్యాంక్ నిర్మాణంతో పాటు ఇంటింటికీ తాగు నీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తోట శ్రీదేవి, ఎంపీటీసీ కాండ్రేగుల వాణి అచ్యుతం, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దొమ్మేటి వెంకటేశ్వరరావు, రేవు శ్రీనివాస్, కాండ్రేగుల సత్యనారాయణ, తోట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



వైద్య రంగంలో విస్తరిస్తున్న అమలాపురం



అమలాపురం పట్టణం

అమలాపురం టౌన్: జిల్లా కేంద్రం అమలాపురం పట్టణం ఇటీవలి కాలంలో వైద్య రంగంలో కొత్త పుంతలు తొక్కుతోంది. నాలుగున్నరేళ్ల క్రితం వరకూ ఎవరికైనా పెద్ద జబ్బు లేదా రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడితే ప్రత్యేక అంబులెన్స్‌లు, కార్లలో ఎన్నో వ్యయప్రయాసలతో కాకినాడ, రాజమహేంద్రవరం, హైదరాబాద్, విశాఖపట్టణం తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు పట్టణంలో ఒక్కో వ్యాధికి ఒక్కో స్పెషలిస్ట్ రావడంతో పాటు అధునాతన వైద్యానికి ఆస్పత్రులు అందుబాటులోకి వచ్చాయి. పట్టణంలోని వివిధ ఆస్పత్రుల్లో వైద్య స్పెషలిస్ట్‌లుగా పనిచేసేందుకు ఇతర రాష్ట్రాల వైద్యులను సైతం తీసుకొచ్చి స్థానిక ప్రజలకు వైద్యం అందిస్తున్నారు. ఇప్పుడు ప్రైవేటుపరంగా ఓ కార్పొరేట్ ఆస్పత్రితో పాటు వైద్య కళాశాల రావడంతో వైద్య సదుపాయాలు మెరుగయ్యాయి. ప్రధానంగా వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లో అత్యవసర వైద్యం అందించేందుకు అవసరమైన సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం కూడా జిల్లా కేంద్రం అమలాపురాన్ని వైద్య పరంగా ముందు ఉంచేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇందులో భాగంగా రూ.500 కోట్లతో పట్టణ సమీపంలోని కామనగరువు, సమనస గ్రామాల సరిహద్దుల్లో 50 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక వైద్య హంగులతో వైద్య కళాశాలను, బోధనా ఆస్పత్రిని నిర్మిస్తోంది. ఇప్పటికే 25 శాతం పనులు పూర్తి చేసుకున్న ఈ ప్రభుత్వ వైద్య కళాశాల త్వరలోనే అందుబాటులోకి రానుంది. ఇప్పుడు పట్టణంలో లభ్యమవుతున్న వైద్య సదుపాయాలకు తోడు ప్రభుత్వం నిర్మిస్తున్న వైద్య కళాశాల, బోధనా ఆస్పత్రి అందుబాటులోకి వస్తే జిల్లాలోని దాదాపు 17 లక్షల జనాభాకు పూర్తి భరోసా లభించినట్లే.

అమలాపురంలో అత్యాధునిక వైద్యం

పట్టణంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం సేవలతో 24 గంటలూ అత్యవసర వైద్యం అందిస్తున్న వాటిలో శ్రీనిధి హాస్పటల్ ఒకటి. కోనసీమలో నవీన్ హెయిర్ అండ్ ఫేస్ క్లినిక్ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో హెయిర్ ప్లాంట్ సర్జరీ చేస్తోంది. చిన్న పిల్లల వైద్య విభాగంలో అత్యాధునిక ప్రమాణాలతో అశ్విన్ పిల్లల హాస్పటల్ వైద్యం అందిస్తోంది. పేదలకు అందుబాటులో కోనసీమ కేర్ జనరల్ అండ్ ఎమర్జెన్సీ హాస్పటల్ అన్ని వ్యాధులకు అధునాతన చికిత్స చేస్తోంది. దంత సమస్యలను నయం చేయడంలో పట్టణంలోని శ్రీనవ్య దంత వైద్యశాల అధునాతన వైద్య సదుపాయాలతో వైద్యం అందిస్తోంది. గతంలో గ్యాస్ట్రిక్ స్పెషలిస్ట్ లేక అవస్థలు పడే వారు. ఇప్పుడు అమలాపురంలో శశి గ్యాస్ట్రో లివర్ కేర్ ఆస్పత్రిలో స్పెషలిస్టులు రావడంతో అత్యాధునిక వైద్యం అందిస్తున్నారు. సాయి సంజీవిని హాస్పటల్ ద్వారా చెవి, ముక్కుచ గొంతు, థైరాయిడ్, గురక, మధుమేహం, పళ్ల క్లిప్పులు తదితర వైద్య చికిత్సలను స్పెషలిస్ట్‌లతో అందిస్తున్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



అయ్యన్ననగర్‌లో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

యానాం: నియోజకవర్గ పరిధిలోని అయ్యన్న నగర్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు బుధవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం దొమ్మేటి కృష్ణార్జునులు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: స్థానిక కొంకాపల్లిలోని జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బుధవారం విద్యార్థులు భోగి మంట వెలిగించి ముందస్తు సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థినులు, మహిళా ఉపాధ్యాయులు ముగ్గులు వేసి, గొబ్బెమ్మలను ఉంచి సంక్రాంతి పాటలు పాడారు. భోగి మంటలు, కోడి పందేలు, గంగిరెద్దులు, పాల పొంగులు, చెరుకు గెడలతో కూడిన చిత్రాలతో ముగ్గులు వేసి అలరించారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా సంక్రాంతి సంబరాల్లో పాలు పంచుకున్నారు.

ఎస్.యానంలో ఆర్డీవో పర్యటన



ఎస్.యానంలో స్థానికులతో మాట్లాడుతున్న ఆర్డీవో కేశవ వర్ధన్‌రెడ్డి

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానంలో ఈ నెల 5న వేదాంత కెయిన్ ఎనర్జీల అనుసంధాన సంస్థ అయిన రవ్వ ప్లాంటు వద్ద జరిగిన స్థానికులు చేసిన ధర్నాలో గ్రామస్తులకు ఇచ్చిన హామీ ప్రకారం ఆర్డీవో జి.కేశవర్ధర్‌రెడ్డి బుధవారం గ్రామంలో పర్యటించారు. పరిశ్రమ నుంచి వచ్చే నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేయాలంటూ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. కలెక్టర్ హిమాన్షుశుక్లా ఆదేశాలతో ఆర్డీవో కేశవ వర్ధన్‌రెడ్డి గ్రామంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. గ్రామస్తులు అడుగుతున్న 18 డిమాండ్లపై ఉన్నతాధికారులతో చర్చించి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి, ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు, జోగి రాజా, లంకే శ్రీను తదితరులు పాల్గొన్నారు.